మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 203 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## అంగుళం భూమిని కూడా ఆక్రమించనివ్వం

- ప్రభుత్వ భూములను పరిరక్షిస్తాం
- సామాన్యులకు మేలు జరిగేలా రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన
- ఆ శాఖ ఉద్యోగులకు ట్రైనింగ్ సెంటర్లు
- తహశీల్దార్ల బదిలీలపై త్వరలో సమీక్షిస్తాం
- మంత్రి పొంగులేటి



హైదరాబాద్, (ప్రజా మంటలు): సామాన్యులకు మేలు జరిగేలా రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన 33 జిల్లాల తహసీల్దార్లతో ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ భూమి అంగుళం కూడా ఆక్రమణకు గురి కాకుండా చూడాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులకు ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు జోడెడ్లలాగ పని చేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రభుత్వ శాఖలలో అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖ ప్రత్యేకమైనదని అంతే కాకుండా అన్ని సందర్భాలలో రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక పాత్ర పోషిస్తారని మంత్రి అన్నారు. రాష్ట్రం మొత్తంలో సుమారు 972 మంది తహసీల్దార్లు ఉన్నారని, గ్రామీణ స్థాయిలో, మండల స్థాయిలో ఉండే సమస్యలను ప్రత్యక్షంగా పరోక్షంగా మీరు ఎదుర్కొంటున్న సమస్యలను మీ ద్వారా తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఈ ముఖాముఖ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి అన్నారు.అంతే కాకుండా రెవెన్యూ చట్టాల సవరణలో క్షేత్రస్థాయిలో ఉండే సమస్యలకు మీరు ఇచ్చేసలహాలు, సూచనలను కూడా అవసరమైన మేరకు పరిగణలోనికి తీసుకుంటామని మంత్రి వివరించారు. ఈ ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలనే తపనతోనే నిరంతరం ఆలోచిస్తుందని, ప్రభుత్వం మీద ప్రజలకు విశ్వాసం ఉండేలా మీరు ప్రజలకు సేవలందరిచాలని మంత్రి తెలిపారు. ధరణిలోని సమస్యలతో ప్రజలు, రైతులు ఎంతగానో ఇబ్బంది పడుతున్నారని, అందుకే ముఖ్యమంత్రి ఆర్‌ఓఆర్ చట్టాల రూపకల్పనను చేసారని మంత్రి అన్నారు.ఇక్కడ ఉన్నవారందరు ఎక్కువ శాతం రైతు కుటుంబాల నుంచి వచ్చిన వారై ఉంటారని రైతుల సమస్యలు మీకందరికి తెలుసన్నారు. రెవెన్యూ శాఖలలో ఎంత నిజాయితీగా పనిచేసిన కూడా నిందలు తప్పవని అంతరాత్మను సాక్షిగా పెట్టుకొని పనులు చేయాలన్నారు. కార్యాలయాలలో సిబ్బంది కొరత, మౌళిక వసతులు, ఫర్నీచర్,న్ఫ్రాస్ట్రక్చర్ లేకపోయిన మీరు అనేక సమస్యలను ఎదుర్కొంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల వరకు చేరవేయడంలో, ప్రభుత్వ భూములను రక్షించడంలో మీరు ముఖ్య భూమిక వహిస్తున్నారని అభినందించారు. అందుకనుగుణంగా మీ సమస్యలను తీర్చేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు. మీరు తప్పు చేస్తే మీకు చెడ్డపేరు వస్తుందో లేదో గాని ప్రభుత్వానికి మాత్రం చెడ్డపేరు వస్తుందని మంత్రి అన్నారు."రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తాం. తహశీల్దార్ల బదిలీలపై త్వరలో ఉద్యోగ సంఘాలతో సమీక్షిస్తాం. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు జోడెడ్లలా పనిచేసి ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి. ప్రభుత్వంలోని అన్ని శాఖలకంటే రెవెన్యూ శాఖ ప్రత్యేకమైనది" అని అన్నారు.

## అభివృద్ధి, స్వేచ్ఛలే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ఎజెండా

- పెదవాళ్లను అడ్డం పెట్టుకుని పెద్దలు వ్యాపారం చేస్తున్నారు - ప్రజల ధన, ప్రాణ, ఆస్తులు కాపాడటం ప్రభుత్వ బాధ్యత
- అందులో భాగంగానే చెరువులను పరిరక్షిస్తాం - భవిష్యత్తు తరాలకు అందిస్తాం
- కాలిఫోర్నియా మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

న్యూయార్క్(జనంసాక్షి): అభివృద్ధి, స్వేచ్ఛ ప్రధాన అంశాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సదరన్ కాలిఫోర్నియా తెలుగు కమ్యూనిటీ, స్థానిక కాన్సుల్ జనరల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అమెరికాలో స్థిరపడిన తెలుగు వారి మేధస్సు తెలంగాణతో పాటు, తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఉపయోగపడాలన్నారు. హైదరాబాద్ అంటేనే రాక్స్, లేక్స్, పార్క్స్... ఇళ్ల నిర్మాణం పేరిట రాళ్లు కనుమరుగై పోయాయి. లేక్స్ కబ్జా చేసి ఇళ్లు కట్టుకున్నారు. పార్కులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. లేక్స్ లేకపోతే ఇటీవల విజయ వాడ నగరం వరదలో చిక్కుకుపోయిన పరి స్థితులు హైదరాబాద్‌లోనూ ఏర్పడ తాయన్నారు. పేదవాళ్లను అడ్డంపెట్టి బిల్డర్స్ నిర్మాణాలు చేపట్టి వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ధన, ప్రాణ, ఆస్తులు కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, అందులో



భాగంగా చెరువులను రక్షించి, భవిష్యత్తు తరాలకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపటినట్లు చెప్పారు. మూసీ నదిలో మంచినీరు పారించడం, పార్కులు తయారు చేయాలనేది ప్రభుత్వం ఆలోచన అని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వనరులను గుర్తించి పద్ధతి ప్రకారం వాటిని వినియోగిస్తామన్నారు. కాలిఫోర్నియాలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు, సింగరేణి సీఎండీ బలరాం నాయక్, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రాపేరుతో బలవంతం చేస్తే సహించం

**- హరీశ్‌రావు**



హైదరాబాద్, (ప్రజా మంటలు): సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారిలా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రూ.1,500 కోట్లతో మూసీ సుందరీకరణ డీపీఆర్ చేస్తున్నారని.. రూ.150 కోట్లతో కనీస వైద్య సదుపాయాలు కల్పించలేరా అని ప్రశ్నించారు. 7 నెలల నుంచి మధ్యాహ్న భోజన బిల్లులు రావట్లేదన్నారు. హైడ్రా పేరుతో బలవంతంగా ఇళ్లు ఖాళీ చేయిస్తామంటే చూస్తూ ఊరుకోబోమని చెప్పారు. మూసీలో మురికి నీరు రాకుండా చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం కూలిపోయింది అంటూనే గోదావరి నీళ్లు తెస్తామంటున్నారని ఎద్దేవా చేశారు. గోదావరి నీళ్లు కాళేశ్వరం నుంచి కాక మరెక్కడి నుంచి తెస్తారో చెప్పాలని ప్రశ్నించారు.హైదర్‌షా కోటలో భారాస నేతల పర్యటన దృష్ట్యా పోలీసులు భారీగా మోహరించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటనకు భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లారు. హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి తదితరులు స్థానికులకు భరోసా ఇచ్చారు. మరోవైపు స్థానికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు.

### పొలిట్రిక్స్


**నల్ల డబ్బు నరులకేమొ**
**వాంగాంగి దండాలు**
**రైతుల దాక వస్తెనేమొ,**
**కన్నెర్రతో రక్తపుటేరులు !**

**ఆ చట్టం ఈ చట్టం**
**కాలయాపనల బాతలే**
**ఊసడిగితే రైతు చట్టం**
**తరిమి తరిమి తన్నులే !**

**- న్యాలకంటి నారాయణ**
**9346200066**

## జమిలికి కేంద్రం వడి వడిగా ..

- ఎన్నికలకు వీలుగా 3బిల్లులు తెచ్చేందుకు రెడీ
- ఆ దిశగా పావులు కదుపుతున్న మోదీ సర్కారు



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): జమిలి ఎన్నికల అమలుకు కేంద్రం కీలక పావులు కదుపుతోంది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు అవసరమైన 3 బిల్లులను తీసుకురానుంది. వాటిలో 2 రాజ్యాంగ సవరణకు సంబంధిచినవిగా తెలుస్తోంది. లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలను ఒక క్రమపద్ధతిలో నిర్వహించేందుకు ఒక రాజ్యాంగ సవరణ బిల్లును రూపొందించారు. ఈ బిల్లు ఆమెదానికి కనీసం 50 శాతం రాష్టాల అంగీకారం అవసరం కానుంది. అయితే, కేంద్రం నిర్ణయాన్ని విపక్షాలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి. ముఖ్యంగా బీజేపీ అవలంభిస్తున్న వైఖరిపై డీఎంకే పార్టీ తీవ్రంగా విమర్శలు గుప్పించింది. దేశవ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా 'ఒకే దేశం- ఒకే ఎన్నిక'కు సంబంధించి, మూడు బిల్లులు ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం. అందులో ప్రస్తుతం ఉన్న ఆర్టికల్?లలో 12 కొత్త సబ్? క్లాజ్?లను చేర్చడం. అసెంబ్లీలు ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన మూడు చట్టాలను సర్దుబాటు చేయడం ఉన్నాయి. అంతేకాకుండా మొదటి దశలో లోక్?సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని సిఫారసు చేసింది. ఆ తర్వాత 100 రోజులకు రెండో దశలో పంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి స్థానిక సంస్థలకు ఎలక్షన్స్? నిర్వహించాలని సూచించింది. ఎన్నికల సంఘం మరియు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ల మధ్య సమన్వయం కోసం ఉమ్మడి ఎలక్టోరల్? రోల్ ఉండాలని హై లెవెల్ కమిటీ సూచించింది.


**జమిలికి విపక్షాలు నో**

జమిలి ఎన్నికలు నిర్వహించి తీరుతామన్న బీజేపీ నిర్ణయాన్ని విపక్షాలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నాయి. అది సాధ్యం కాదంటూ చెబుతున్నాయి. అందులో ఒకడుగు ముందుకేసింది తమిళనాడు అధికార పార్టీ డీఎంకే. ఒకే దేశం-ఒకే ఎన్నిక ద్వారా బీజేపీ రాష్ట్రాలను తొక్కేయడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించింది. జమిలి ఎన్నిక సాధ్యం కాదని చెప్పింది. "1967 వరకు పార్లమెంటు, శాసనసభకు ఎన్నికలు కలిపి జరిగేవి. అయితే అప్పటి (1967) భారతదేశ జనాభా ఎంత? ఇప్పుడు జనాభా ఎంత? ఆనాటి భారతదేశం, నేటి భారతదేశం ఒకటేనా? ఆ రోజు ఓటర్ల సంఖ్య ఎంత? నేటి ఓటర్ల సంఖ్య ఎంత? ఇప్పుడు 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉన్నాయి. మొత్తం 4000 ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలి. 1951లో మొత్తం ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు 1874, 2024 లోక్?సభ ఎన్నికల్లో 8,360మంది పోటీ చేశారు. ఆనాటి ఎన్నికలు, నేటి ఎన్నికలు ఒకటేనా? ప్రస్తుతం 90మంది సభ్యులున్న జమ్ముకశ్మీర్? అంసెబ్లీ ఎన్నికలే మూడు దశల్లో జరుగుతున్నాయి. ఈ తరుణంలో ఒకే దేశం-ఒకే ఎన్నిక అనడం సిగ్గుచేటు కాదా?" అని డీఎంకే ప్రశ్నల వర్షం కురిపించింది.

**కేంద్రం 'ఒకే' పాట పాడుతోంది : డీఎంకే**

"ఒకే మతం, ఒకే భాష, ఒకే ఆహారం, ఒకే సంస్కృతి, ఒకే పరీక్ష, ఒకే ఎన్నికలు, ఒకే పన్ను అంటూ అదే పాట పాడుతున్నారు. ఇది(ఒకే దేశం-ఒకే ఎన్నిక) అసాధ్యమైన సమస్యాత్మకమైన అంశం. ఇది ప్రజాప్రాతినిధ్య చట్టానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధం. దీంతో ఏం జరుగుతుంది? అనేక రాష్ట్ర ప్రభుత్వాల పదవీకాలం తగ్గుతుంది! రాష్ట్రాల్లో గందరగోళం నెలకొంటుంది" అని డీఎంకే విమర్శించింది.

### ప్రజా నాడి




## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



జనగామ సెప్టెంబర్ 29(ప్రజామంటలు): జనగామ జిల్లా లింగాల ఘనపురం లోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ఆవిష్కరించారు. అనంతరం బీసీ, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షా కిట్స్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి, ఎంపీ, కలెక్టర్, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు పాల్గొనగా.వారి చేతుల మీదుగా గౌడ కులస్తులకు రక్షా కిట్స్ ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ....దసరా లోపు గౌడ కులస్తులకు ఎక్సగ్రెషియా బకాయిలు చెల్లిస్తామన్నారు. మన హక్కుల కోసం, సమస్యల కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. మనకు తెలియకుండానే మన పూర్వికుల పోరాట స్ఫూర్తి మనకు వస్తుందన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటాలను ఆనాడు బాహ్య ప్రపంచానికి తెలియకుండా చేసారని ఈనాడు గౌడ కులుస్తులు చైతన్యమయ్యి పాపన్న ను మార్గదర్శకంగా తీసుకుంటున్నారన్నారు ఏ ఒక్క గౌడ కులస్తులు తాటి చెట్టు మీద నుండి పడకుండా.. వారి రక్షణ కోసం ప్రభుత్వం అలోచించి కాటమయ్య రక్షా కిట్స్ ని రూపొందించిందన్నారు. నిట్ వారు పరిశోధనలు జరిపి కాటమయ్య రక్షా కిట్స్ ని తయారు చేసారన్నారు. 2 సంవత్సరాలల్లో రాష్టం లోని ప్రతీ ఒక్క గౌడ కులస్తులకు కాటమయ్య రక్షా కిట్స్ అందిస్తామన్నారు. ఈ కిట్స్ వాడకం గురించి...శిక్షణ తీసుకోని దీనిని ఎలా వాడాలో అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కుల గణన జరిగిన తర్వాత నే స్థానిక ఎన్నికలు జరుగుతాయన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలని అనేక కార్పొరేషన్ లను ఏర్పారచమన్నారు. స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ ద్వారా... మరుగున పడుతున్న కుల వృత్తులకు.. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక శిక్షణ ఇచ్చి... జీవన ఉపాధి అవకాశాలు మెరుగు పడేలా కృషి చేస్తామన్నారు. కులవృత్తి ని అనుసరిస్తూనే. మన బిడ్డలకు విద్యను కూడా అందించాలన్నారు. బిడ్డల చదువు విషయంలో ఏ తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఉన్నతమైన విద్యతో కుటుంబ దిశా, దశ మారుద్దన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న 25000 పాఠశాల లో 1100 కోట్ల రూపాయలతో అమ్మ ఆదర్శ కమిటీ ల ద్వారా ఎన్నో అభివృద్ధి పనులను చేశామన్నారు. పాఠశాలలన్నింటికి ఉచిత కరెంట్, తాగనీరు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే 19,000 మంది టీచర్ లకు ప్రమోషన్ లు ఇచ్చామన్నారు. మహనీయుల విగ్రహం పెట్టడం తోనే సరిపెట్టవద్దని ... వారు చేసిన పోరాటాలను నిత్యం స్మరించుకోవాలన్నారు వారి విగ్రహం చూసినప్పుడల్లా మనలో మార్పు రావాలన్నారు.వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.... ఎన్నో పోరాటాలు చేసిన మహనీయులు మన జిల్లా ల్లో చాలా మంది ఉన్నారన్నారు అందరికి గొప్ప చరిత్ర ఉందన్నారు

మిగతా 2లో..

# మూసీ వ్యవహారంపై బీఆర్ఎస్ అనవరరాద్ధాంతం

**- నిర్వాసిత కుటుంబాల జీవితాలతో ప్రతిపక్షాలు ఆడుకోవద్దు - మంత్రి పొన్నం ఆగ్రహం**

హైదరాబాద్, (ప్రజా మంటలు): మూసీ బాధితుల పట్ల హరీశ్‌రావు లాంటి నాయకులు రాజకీయం చేస్తున్నారని మంత్రి పొన్నం ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మల్లన్నసాగర్ నిర్వాసితులను లాఠీలతో అణచివేశారని ఆయన పేర్కొన్నారు. అధికారం లేదని బీఆర్ఎస్ నాయకులు ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, మూసీ నిర్వాసిత కుటుంబాల జీవితాలతో ప్రతిపక్షాలు అడుకోవద్దని హెచ్చరించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతాలు చేస్తున్నాయని రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇవాళ సిద్దిపేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ, హైదరాబాద్ లోని మూసీ నదికి ఇరువైపులా నివాసం ఉన్న వారిని బలవంతంగా ఖాళీ చేయించడం లేదని, వారి అంగీకారం తోనే ముందుకు సాగుతామని వెల్లడించారు. సోషల్‌మీడియాలో అసత్య ప్రచారం : మూసీ ప్రాజెక్టుపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతోందని మంత్రి పొన్నం తెలిపారు. తెలంగాణ ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని ఆయన సూచించారు. మూసీ బాధితులకు ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇస్తున్నామని, అలాగే సెల్ఫ్ ఎంప్లాయ్?మెంట్ ఇచ్చి ఆదుకుంటామని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలది మంచి పద్ధతి కాదని, మూసీని మంచి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి చూపిస్తామని పేర్కొన్నారు. ప్రతిపక్షాల రాజకీయం : మూసీ బాధితుల పట్ల హరీశ్ రావు లాంటి నాయకులు రాజకీయం చేస్తున్నారని మంత్రి పొన్నం మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మల్లన్నసాగర్ నిర్వాసితులను లాఠీలతో అణచివేశారని మంత్రి పొన్నం దుయ్యబట్టారు. అధికారం లేదని బీఆర్ఎస్ నాయకులు ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గత కాంగ్రెస్ హయాంలో కృష్ణ, గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలించి ప్రజలకు తాగు నీరు ఇచ్చినట్లు గుర్తు చేశారు. హైదారాబాద్‌లోని మూసీని, లేక్ సిటీ తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. యావత్ రాష్ట్రంలో హైడ్రాను స్వాగతిస్తున్నారని, రాబోయే కాలంలో అన్ని చెరువులను రక్షిస్తామన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే చర్చల ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు."తెలంగాణ ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు. మూసీ బాధితుల పట్ల హరీశ్‌రావు లాంటి నాయకులు రాజకీయం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మల్లన్నసాగర్ నిర్వాసితులను లాఠీలతో అణచివేశారు. అధికారం లేదని బీఆర్ఎస్ నాయకులు ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు" అన్నారు.

## మన్‌కీ బాత్ కు పదేళ్లు

– ఇది చాలా ప్రత్యేకమన్న ప్రధాని

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): మనసులో మాట పేరుతో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమం 114వ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రజల ప్రయత్నాలు, స్ఫూర్తిదాయకమైన కథనాలను మన్‌కీబాత్ చూపిస్తోందన్నారు. కార్యక్రమం ప్రారంభించి పదేళ్లు పూర్తిచేసుకోనున్న నేపథ్యంలో ఈ ఎపిసోడ్ తనకు భావోద్వేగమైనదని అన్నారు. సామూహిక శక్తిని ప్రదర్శించే ప్రత్యేక వేదికగా ఈ కార్యక్రమం మారిందన్నారు. మన్‌కీ బాత్ ద్వారా తన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియాకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా మసాలాలేని కంటెంట్‌ను ప్రజలు పట్టించుకోరనే అభిప్రాయం ఉండేదని.. ఈ కార్యక్రమం ఆ అభిప్రాయాన్ని మార్చేసిందన్నారు. స్ఫూర్తిమంతమైన కథలు, ప్రేరణ పొందే వ్యక్తులకు సంబంధించిన విషయాలు తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. నీటి నిర్వహణ గురించి ప్రస్తావించిన ఆయన.. నీటి సంరక్షణ ఎంత కీలకమో వర్షాకాలం సూచిస్తుందని చెప్పారు. నీటి సంరక్షణకు అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. 20 వేల భాషలకు భారత్ పుట్టినిల్లు అని పేర్కొన్న మోదీ.. దేశంలో వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. 'తల్లి పేరిట మొక్క' కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమం పేరిట గుజరాత్‌లో 15 కోట్లకు పైగా, యూపీలో 26 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు తెలిపారు.

## విజయభారతి పార్థివ దేహం గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగింత

**నివాళులు అర్పించిన రాహుల్ బొజ్జా, గోరెటి వెంకన్న**





సికింద్రాబాద్ సెప్టెంబర్ 29 (ప్రజామంటలు): ప్రముఖ రచయిత్రి విజయభారతి (83) పార్థివ దేహాన్ని సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు. పద్మభూషన్ బోయి భీమన్న కుమార్తె, బొజ్జా తారకం సతీమణి, సీనియర్ ఐఏఎస్ అధికారి రాహుల బొజ్జా మాతృమూర్తి విజయభారతి అనారోగ్యంతో శనివారం తుదిశ్వాస విడిచిన సంగతి విదితమే. వైద్యవిద్యార్థుల పరిశోధనాల కోసం విజయ భారతి పార్థివదేహాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించాలని ఆమె కుటుంబసభ్యులు నిర్ణయించారు. ఈమేరకు ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేక అంబులెన్స్‌లో విజయభారతి పార్థివదేహాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి తరలించారు. రాష్ట్ర నీటిపారుదల పిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జాతోపాటు కుటుంబసభ్యులు, బంధువులు, సామాజిక ఉద్యమ కారులు సంధ్య, గోరెటి వెంకన్న తదితరులు హాజరై విజయభారతి మృతదేహానికి నివాళులర్పించారు. విజయభారతి పార్థివదేహాన్ని గాంధీ మెడికల్ కాలేజీ అనాటమీ విభాగానికి అప్పగించినట్లు గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కు "గౌరవ డాక్టరేట్" అవార్డు ప్రదానం



మెట్ పల్లి సెప్టెంబర్ 29 (ప్రజామంటలు): భారత రత్న అవార్డు గ్రహీత, తత్వ వేత్త, భారత దేశ ఉపరాష్ట్రపతి,రాష్ట్రపతిగా పని చేయడంతో పాటు మంచి ఉపాధ్యాయునిగా పేరు సంపాదించిన కీర్తి శేషులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే.వేంకయ్యకు అమెరికా కేంద్ర విశ్వ విద్యాలయం (యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ అమెరికా) ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్ అవార్డును ఆ కళాశాల మాజీ ప్రిన్సిపాల్,కరీంనగర్ పట్టణంలోని శ్రీ రాజ రాజేశ్వర (ఎస్ ఆర్ ఆర్ – అటానమస్) కళాశాల ప్రస్తుత తెలుగు విభాగం అధిపతి డాక్టర్ బూర్ల చంద్ర శేఖర్ ఆదివారం రోజున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,దాదాపు గత 34 సంవత్సరాల నుంచి కోరుట్ల,మెట్ పల్లి పట్టణాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు అనేక రకాల సేవలను అందించారని, దాంతో సెంట్రల్ అమెరికా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసిందని అన్నారు. ఆయన విద్యార్థులు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర రాష్ట్రాలతో పాటు గల్ఫ్ దేశాల్లో గల వివిధ ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్నారని, దాంతో ఆయనకు విద్యా రంగంలో మంచి పేరు, ప్రతిష్ఠలు ఉన్నాయని వివరించారు. భవిష్యత్తులో మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్యకు మంచి రోజులు రావాలని మనసారా కోరుకుంటున్నట్లు డాక్టర్ బూర్ల చంద్ర శేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ బూర్ల చంద్ర శేఖర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకోవడం తన పూర్వ జన్మ సుకృతమని, ఈ సంఘటనను జీవితంలో ఎన్నటికీ మరచిపోలేనని అవార్డు గ్రహీత డాక్టర్ కే. వేంకయ్య ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కో–ఆర్డినేటర్ మరియు ఇంగ్లీష్ సహాయ ఆచార్యులు బిల్ల రాజేందర్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సహాయకులు ఎం. గంగాధర్, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జనహిత సేవా ట్రస్ట్ కు ఎక్సలెన్సీ-2024 అవార్డు




సికింద్రాబాద్ సెప్టెంబర్ 29 (ప్రజామంటలు): పద్మారావునగర్ కు చెందిన జనహిత సేవా ట్రస్ట్ సామాజిక సేవా రంగంలో ఉత్తమ సేవలను అందిస్తున్నందుకు గుర్తింపుగా ఎక్సలెన్సీ%–%2024 అవార్డు గెల్చుకుంది. ఆదివారం సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో పీఎం ప్రొడక్షన్స్ సంస్థ డైరెక్టర్ జే.శైలజ జనహిత సంస్థ మేనేజింగ్ ట్రస్టీ సోమయాజుల నర్సింహా మూర్తిని శాలువాతో సన్మానించి, అవార్డును అందచేశారు. ఈసందర్భంగా నర్సింహామూర్తి మీడియాతో మాట్లాడుతూ...2013 నుంచి తమ సంస్థ ద్వారా గాంధీ దవఖానలో నిరుపేద ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రోగి సహాయకులకు షెల్టర్ హోమ్ నిర్వహణ, హెల్ప్ డెస్క్ ల ఏర్పాటు చేశామన్నారు. అలాగే సిటీలోని పలు బస్తీలలో ఉచిత వైద్య శిభిరాలు,రక్తదాన శిభిరాల నిర్వహణ, యువతకు, మహిళలకు ఉపాధి శిక్షణ, దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అందచేత, పేద విద్యార్థులకు బోధన తదితర సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా నర్సింహామూర్తిని పలువురు అభినందించారు.

## దవాఖానాలే కేంద్రంగా వరసగా బైక్ ల దొంగతనం కామారెడ్డి వాసి అరెస్ట్

**రూ. 10 లక్షల విలువ చేసే 18 బైక్ లు స్వాధీనం**

**బైక్ దొంగతో పాటు బైక్ లు కొన్న వారు అరెస్ట్**



సికింద్రాబాద్ సెప్టెంబర్ 29 (ప్రజామంటలు): ఆసుపత్రులే కేంద్రంగా చేసుకొని 18 బైక్ లను దొంగిలించిన దొంగను చిలకలగూడ పోలీసులు పట్టుకున్నారు. ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి ఆదివారం సాయంత్రం చిలకలగూడ పోలీస్ స్టేషన్ లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. కామారెడ్డికి చెందిన కే.శ్రీనివాస్ (35) ఏ పనిచేయకుండా కొంతకాలంగా దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఆసుపత్రుల్లోకి వెళ్ళి, తాళం వేసి ఉన్న బైక్ లను తన దగ్గర ఉన్న డమ్మీ తాళంచెవిల సాయంతో ఎత్తుకెళ్ళి, తక్కువ ధరలకు వాటిని విక్రయించేవాడు. గత మూడేండ్లుగా సాగుతున్న చోరీల పర్వంలో గాంధీ ఆసుపత్రి, నిలోఫర్, ఉస్మానియా, ఈఎస్ఐ, మెదక్ దవఖానాలతో పాటు మియాపూర్, మెట్టుగూడ, బాలానగర్ మెట్రోస్టేషన్, తదితర ప్రాంతాల్లో పార్క్ చేసి ఉన్న మొత్తం 18 బైక్ లను ఎత్తుకెళ్ళాడు. బాధితుల ఫిర్యాదు మేరకు వివిద పోలీస్ స్టేషన్ ల్లో కేసులు నమోదు అయ్యాయి. ఈ క్రమంలో గాంధీ ఆసుపత్రి వద్ద నిఘా పెట్టిన చిలకలగూడ పోలీసులు సీసీ ఫుటేజీల సాయంతో బైక్ లను ఎత్తుకెళ్ళుతున్న శ్రీనివాస్ ను పట్టుకొని విచారించారు. ఈ కేసుల్లో మొత్తం రూ 10 లక్షలు విలువ చేసే 18 బైక్ లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు కే.శ్రీనివాస్ తో పాటు చోరి చేసిన బైక్ లను కొనుగోలు చేసిన బెజవాడ ఏసురత్నం, బీ.శాంతారావు, అనంగి శ్రీను లను కూడ అరెస్ట్ చేశారు. వరస బైక్ ల దొంగతనాల కేసును చేధించిన చిలకలగూడ డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ రమేశ్ గౌడ్, ఎస్.ఐ ఆంజనేయులు, కానిస్టేబుళ్ళు నవీన్ కుమార్, జగదీశ్, షేక్ మదర్ బాషా, గణేశ్, వినయ్ కుమార్, కృష్ణ, హెడ్ కానిస్టేబుళ్ళు కృష్ణ, ప్రమోద్, నరేశ లను డీసీపీ బాలస్వామి అభినందించి, వారికి క్యాష్ రివార్డులను అందచేశారు. మీడియా సమావేశంలో అడిషనల్ డిప్యూటీ కమిషనర్ నర్సయ్య, ఏసీపీ జైపాల్ రెడ్డి, సీఐ అనుదీప్, ఎస్ఐ సబిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఫలించిన రెండు దశాబ్దాల కల సాకారం

**డాక్టర్ షేక్ చాంద్ పాషా : గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటం, కృషి**










హైదరాబాద్ సెప్టెంబర్ 29 (ప్రజామంటలు): గల్ఫ్ కార్మికుల కష్టాలు. అక్కడి చట్టాలు. తాను అనుభవించిన గల్ఫ్ కష్టాలు. గల్ఫ్ ఏజెంట్ల మోసంపై రాసిన 'గల్ఫ్ గాయం' డాక్టర్ షేక్ చాంద్ పాషా ఆటో బయోగ్రఫీ పుస్తకం సీఎం రేవంత్ రెడ్డి. మంత్రులకు అందజేత. గల్ఫ్ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ షేక్ చాంద్ పాషా. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి ఏర్పాటు చేయడంపై టీపీసీసీ ఎన్నారై కన్వీనర్ డాక్టర్ షేక్ చాంద్ పాషా హర్షం వ్యక్తం చేశారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రగతిభవన్లో ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు లో కార్యక్రమంలో టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ డాక్టర్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....గల్ఫ్ కార్మికుల సమస్యలపై, ఏజెంట్ల చేతిలో మోసపోయిన కార్మికుల స్థితిగతుల ను వివరిస్తూ రూపొందించిన నివేదికను అధికారులు ప్రజాప్రతినిదులం దరికి అందజేసి, చేసిన పోరాటం, గల్ఫ్ బోర్డ్ ఏర్పాటు చేయాలనే నా కల సహకారం అయిందని డాక్టర్ షేక్ చాంద్ పాషా ఆనంద భాష్పాలతో చెప్పారు. రెండు దశాబ్దాలుగా గల్ఫ్ సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటంలో నా వెంట ఉండి నడిపించిన పాత్రికేయులు ప్రజాప్రతినిధులందరికీ కృతజ్ఞతలు అన్నారు. గల్ఫ్ సమస్యలపై పోరాటంలో వెంట ఉండి సహకరించిన మాజీ మంత్రివర్యులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ ఎంపీ కాంగ్రెస్ ప్రచార కమిటీ సారధి చైర్మన్ మధుయాష్కి గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గల్ఫ్ లో కార్మికులు పడుతున్న కష్టాలు, అక్కడి చట్టాలపై అవగాహన లేక, జైళ్ళలో మగ్గుతున్న కార్మికుల దయనీయ పరిస్థితులను కళ్లారా చూసానని, కుటుంబాలకు దూరంగా ఉంటూ ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టిన కార్మికులు, గల్ఫ్ లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని, గల్ఫ్ బోర్డ్ ఏర్పాటు చేయాలని, రు.5 లక్షలు ఆర్థిక సాయం అందించాలని, రెండు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నానని డాక్టర్ షేక్ చాంద్ పాషా ఆనాటి రోజులను గుర్తు చేసుకున్నారు. గల్ఫ్ చట్టాలపై అవగాహన లేకపోవడంతో పాటు గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయి గల్ఫ్ లో చిక్కుకుపోయిన వేలాదిమంది కార్మికులను అక్కడి ఎంబసీ అధికారులతో, ఇండియా ఎంబసీ అధికారులతో మాట్లాడి వందలాది లేఖలు రాసి స్వదేశాలకు రప్పించానని గుర్తు చేశారు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన కార్మికులు అనారోగ్యం బారిన పడి మృతి చెందితే వేలాది మృతదేహాలను స్వదేశానికి తీసుకు వచ్చి ఆయా కుటుంబాలకు అప్పగించానని అన్నారు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లే కార్మికుల ను నకిలీ విజయాలతో మోసం చేసిన ఏజెంట్ల పై పోరాటం చేశానని, వందలాదిమంది కి శిక్ష పడేలా కృషి చేశానని, నకిలీ ఏజెంట్ల మోసపూరిత మాటలతో మోసపోకుడదని, గ్రామాల్లో తిరిగి ప్రజలను చైతన్య పరచాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికుల బోర్డు ఏర్పాటు చేయాలని, రు. 5 లక్షల పరిహారం ఇవ్వాలని మేనిఫెస్టో కమిటీకి తన నివేదిక అందించానని గుర్తు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోకు అనుగుణంగా గల్ఫ్ కార్మికుల బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు గల్ఫు మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు 5,00,000 ఆర్థిక సాయం అందజేయాలని సీఎం రేవంత్ రెడ్డీ ప్రకటించడంపై సంతోషంగా ఉందన్నారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాల తరపున సీఎం రేవంత్ రెడ్డి తో పాటు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ ఎం పి మధుయాష్కి, మంత్రులు పొన్నం ప్రభాకర్ దుద్దిల శ్రీధర్ బాబు ప్రభుత్వ విప్లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్ లకు డాక్టర్ షేక్ చాంద్ పాషా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కొప్పూరు పరుపుల బండపై శిలా యుగం నాటి పురాతన అవశేషాలు



భీమదేవరపల్లి, సెప్టెంబర్ 29 (ప్రజామంటలు) : ఆనాటి కాలంలో రాజుల సైన్యం వారి కత్తులను పదును చేసేందుకు ఉపయోగించిన నూరుడు గుంతలను భీమదేవరపల్లి మండలంలోని కొప్పూరు గ్రామంలో పరుపుల బండపై కనుగొన్నట్లు ఏకో ట్రావెలర్ ప్రతాప్ తెలిపారు. కొప్పూరు గ్రామంలోని తాళ్లవాగు అవతల ఉన్న తుమ్మలకుంటకి దగ్గరలో ఈ పరుపుల బండ ఉందన్నారు. ఈ బండపై అనేక నూరుడు గుంతలు ఉన్నాయని చెప్పారు. ఆదిమ మానవుడు సైతం రాతి గొడ్డల్లను నూరుకోవడానికి ఈ గుంతలను ఉపయోగించేవారని తెలిపారు. పురావస్తు పరిభాషలో ఈ గుంతలను గ్రూవ్స్ అంటారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ గ్రామ సమీపంలో 400 ఏళ్ల క్రితం నాటి కోటగోడలు మరో గుట్టపై ఉన్నాయని వెల్లడించారు. కోటగోడలు, నూరుడు గుంతలను గ్రామస్తులు పరిరక్షించాలని కోరారు.

## యాపుల పేరుతో అమాయకుడు బలి



భీమదేవరపల్లి సెప్టెంబర్ 29 (ప్రజామంటలు) : మండలం మల్కనూరు గ్రామానికి చెందిన మాడుగుల అనిల్ (29) అనే వ్యక్తి డిగ్రీ చదివి నిరుద్యోగిగా ఇంటివద్దే ఉంటున్నాడు. ఉపాది కోసం వివిధ రకాల యాప్ లు, బ్యాంకుల ద్వార సుమారు 9 లక్షలు అప్పు చేసి టాటా ఏసీ ఆటో ద్వారా బీమారంలో మొబైల్ టిఫిన్ సెంటర్ ప్రారంభించాడు. ఈక్రమంలో నష్టాలు రావడంతో వ్యాపారం మానేసి ఇంటి వద్దనే ఉండేవాడు. అనంతరం తిరిగి 2 నెలల క్రితం మరింత అప్పుచేసి మల్కనూర్లో అమరవీరుల స్థూపం వద్ద ఫాస్ట్ ఫుడ్ సెంటర్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఇక్కడ కూడా షాప్ నడువక పోవడంతో అప్పులు చెల్లించడానికి ఫోన్లో ఉన్న వివిధ యాప్ ల ద్వారా అప్పు తీసుకున్నాడు. అప్పులు కట్టలేక మనస్తాపం చెంది ఈ నెల 28 న రాత్రి రైతు వేదిక వద్ద ఉన్న క్రీడా ప్రాంగణంలో పురుగుల మందు సేవించానని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబసభ్యులు వచ్చి చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ, ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి వినోద ఫిర్యాదు మేరకు ఎస్సై కేస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## ఆలయాలను పరిరక్షిస్తే సనాతన ధర్మం కొనసాగుతుంది

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కొండగట్టు సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు)

బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో బృందావన్ రిసార్ట్ కొండగట్టు వారి సౌజన్యంతో ద్వాదశ ఆలయాల అర్చకులకు సన్మాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివతాండవము, మమతాపమా గురుదేవా లాంటి శాస్త్రీయ నృత్యాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బంగారయ్య శర్మ ,నంబి వేణుగోపాల ఆచార్య, పురాణం మహేశ్వర శర్మ, తదితరులు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి హిందువు కృషి చేయాలని ఆలయాలను పరిరక్షిస్తే సనాతన ధర్మం కొనసాగుతుందని అదే విధంగా ఆర్థికంగా ఉన్నవారు జీర్ణ దేవాలయాలను దత్తత తీసుకొని సనాతన ధర్మాన్ని పరిరక్షించాలని అన్నారు. బ్రాహ్మణుని విశిష్టతను భాగవతంలోని విషయాలను ఉటంకించారు. అర్చకుని యొక్క విశిష్టత నియమ, నిష్టలు ధర్మరక్షణకు ఎంతగానో ఉపకరిస్తాయని అన్నారు. అర్చకుల్లోనే హరిని సాక్షాత్తుగా దర్శించుకుంటామని అలాంటి అర్చక వృత్తిలో ఉన్నవారు సమాజానికి సనాతన ధర్మం గూర్చి తెలియపరచాలని అన్నారు.













## ఘనంగా బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ద్వాదశ ఆలయ ప్రధాన అర్చక సన్మాన మహోత్సవం

కొడిమ్యాల బృందావన్ రిసార్ట్ సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు): బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో నాచు పెల్లి వద్ద గల బృందావనం ఫ్యామిలీ రిసార్ట్ కొండగట్టు వారి సౌజన్యంతో ప్రధాన ఆలయాల ద్వాదశ ఆలయ ప్రధాన అర్చక సన్మాన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకు పూర్వము జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బంగారయ్య శర్మ, పురాణం మహేశ్వర శర్మ, నంబి వేణుగోపాల ఆచార్య తదితరులు జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. చిన్నారులు చేసిన నృత్యాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విచ్చేసిన బ్రాహ్మణ బంధువులకు రిసార్ట్ యజమాని కొండల్ రావు బ్రాహ్మణ సమారాధన ఏర్పాటు చేశారు .కార్యక్రమంలో బ్రాహ్మణ సంక్షేమ వేదిక అధ్యక్షులు బాల శ్రీనివాస్ తమ సంస్థ ద్వారా చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యదర్శి ఉజ్వల విచ్చేసిన అతిధులను స్వాగతించి తన కార్య నిర్వహణ నైపుణ్యంతో వేదిక కార్యక్రమంలో అన్ని తానై ఏర్పాట్లు చేశారు. అంతకుముందు అతిథులకు వైదిక సాంప్రదాయం ప్రకారం మంగళవాద్యాల ఘోషతో పూర్ణకుంభ స్వాగతం పలికారు రిసార్ట్ యజమాని కొండలరావు దంపతులు. విచ్చేసిన అర్చకులకు ముఖ్య అతిథులకు బృందావనం రిసార్ట్ లో శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

## సాహితీవేత్త బొజ్జ విజయభారతి మృతికి పలువురి సంతాపం



హైదరాబాద సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు) : ప్రముఖ సాహితి వేత్త, సీనియర్ ఐఏ ఎస్ అధికారి బొజ్జా రాహుల్ తల్లి బొజ్జ (బోయి) విజయభారతి మృతి మహిళాలోకానికి, దళితవర్గానికే కాక, తెలంగాణ సమాజానికి తెరనిలోతని పలువురు ఆమె మృతిపాతలవిచారం వ్యక్తం చేశారు. నిజామాబాద్ లో డిగ్రీ గిరి రాజ్ కళాశాలలో ఉపన్యాసకురాలి గా, తెలుగు అకాడమీ డిప్యూటీ సంచాలకులుగా, సంచాలకులు గా విశిష్ట సేవలు అందించి న విషయం తెలిసిందే. విశ్రాంత ఉద్యోగి గా, నిరంతర పరిశోధ కు రాలుగా చివరి వరకు పని చేశారు. వారి మరణం సమాజానికి తీరని లోటు. %ళి% తెలుగు సమాజంలోనీ ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, రచయిత, రచయిత్రులకు విచారకరమైన వార్తను తెలియచేస్తున్నందుకు బాధపడుతున్నాను:ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, ప్రముఖ అనువాధకురాలు, తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్, అంబేద్కర్ రచనల, ప్రసంగాల సంపుటాలకు సంపాధకురాలు, మహాత్మా జోతి రావు పూలే జీవిత చరిత్రను తెలుగు సమాజానికి మొట్ట మొదటి సారి అందించిన రచయిత్రి, ప్రముఖ కవి, రచయిత, పద్మ భూషణ్ డా. బోయిభిమన్న గారి పెద్ద కుమార్తె, అమరుడు బొజ్జా తారకం సహచరిని డా. విజయ భారతి మృతికి పలువురు సంతాపం ప్రకటించారు. విజయ భారతి తన శేరిరాన్ని గాంధీ మెడికల్ కాలేజీ కి డొనేట్ చేశారు. విజయభారతి సంపద్వంతమయిన, అర్థవంతమైన జీవితం జీవించారు. వారితో కలిసి పనిచేయడం ఒక మంచి అనుభవం. వారి స్మృతికి నివాళులు అర్పిస్తున్నట్లు డా. తుల రాజేందర్ తెలిపారు. వివధ జిల్లాల కలక్టర్లు శశాంక, విజయేంద్ర, జలమండలి సంచాలకుడు దాన కిషోర్, సామాజిక కార్యకర్తలు సజయ, విమలక్కా, తుల ఉమా, సంగిశెట్టి శ్రీనివాస్, అంబిక, బిఆర్ఎస్ నాయకురాలు, కరీంనగర్ ఇల్లాపరిషత్ మాజీ చైర్పర్సన్ తుల ఉమ తదితరులు ఆమె మృతికి నివాళులు అర్పించారు.

## గాంధీ వద్ద ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

### డీసీఎం వెహికిల్స్ కు నోటీసులు



సికింద్రాబాద్ సెప్టెంబర్ 29 (ప్రజామంటలు): చిలకలగూడ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం గాంధీ ఆసుపత్రి, మెట్రో స్టేషన్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి సమీపంలో మెట్రో స్టేషన్ రోడ్డు పక్కన అక్రమంగా పార్కు చేస్తున్న డీసీఎం వాహనాలదారులకు నోటీసులు అందచేశారు. వెంటనే వాహనాలను రోడ్డు పక్కన నుంచి తొలగించాలని, లేనిపక్షంలో భారీ జరిమానా వేస్తామని హెచ్చరించారు. అలాగే మెట్రో డివైడర్ల పై చాలాకాలంగా నివసిస్తున్న యాచకులను అక్కడి నుంచి పంపించేశారు. ప్రధాన రహదారి పై తిరుగుతున్న యాచకులు ఇటీవల ప్రమాదాలకు గురవుతున్నారని ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గాంధీ ఎదురుగా ఇప్పటి నుంచి అన్నదానాలు నిర్వహించవద్దని, దీనివలన ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలు కూడ సాదారణమయ్యాయని తెలిపారు.



## కరీంనగర్ లో కాలుష్య రహిత, ఎలక్ట్రిక్ బస్ లను ప్రారంభించిన

### బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

### పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

కరీంనగర్ సెప్టెంబర్ 29 (ప్రజామంటలు):

టీ ఎస్ ఆర్ టి సి ఆధ్వర్యం లో కరీంనగర్ లో కాలుష్య రహిత ,ఎలక్ట్రిక్ బస్ లను ప్రారంభించిన బిసి సంక్షేమ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ . పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంపి గా ఉండి పార్లమెంట్ సాక్షిగా పోరాటం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్. రాష్ట్రంలో ఆర్ టి సి తిరిగి గాడిన పెట్టె విధంగా వారి ఆలోచనలు ఉన్నాయి.కాలుష్య రహిత, ఎలక్ట్రిక్ బస్ లు ప్రారంభించుకోవడం చాలా ఆనందంగా ఉందని, జగిత్యాల నియోజకవర్గానికి సైతం కడెం నుండి రాయికల్ మీదుగా జగిత్యాల మరియు జగిత్యాల నుండి కరీంనగర్ హైదరాబాద్ కి రెండు బస్ లు మంజూరు చేయాలని ఈ సందర్భంగా మంత్రి ని కోరారు ఎమ్మెల్యే.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లు మేడిపల్లి సత్యం, సత్యనారాయణ, ఆర్ టిసి యం.డి. సజ్జనార్, కలెక్టర్ పమేలా సత్పాతి, మేయర్ సునీల్ రావు, అదనపు కలెక్టర్, కమిషనర్,అర్ టి సి సిబ్బంది,ప్రజా ప్రతినిదులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ఆ చరిత్ర ప్రతి ఒక్కరికి తెలిసేలా తెలంగాణ సాధించుకున్నాక వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా జరుపుకుంటు స్మరించుకుంటున్నామన్నారు. మహనీయుల చరిత్ర అడుగంటి పోకుండా... వారి పోరాట పటిమలు భావితరాలకు తప్పకుండా తెలియాలన్నారు. ప్రతీ ఒక్కరి సంక్షేమం కోసం ప్రభుత్వం అలోచించి అందుకు తగ్గట్టుగా సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు.

స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ....సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తి తో మనందరం ముందడుగు వేయాలన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన పాపన్నను చరిత్రకారులు చిన్నచూపు చూసారని, భూస్వాములకు వ్యతిరేకంగా ఆయన చేసిన దండయాత్రల గురించి ఎవరు గొప్పగా చెప్పలేదన్నారు. పాపన్న ఖిలా షాపూర్ లో పుట్టారని పాపన్న కట్టిన కోట అక్కడ ఉన్నందున దానికి ఖిలా షాపూర్ అని పేరు వచ్చిందన్నారు.చిన్నతనంలోనే బానిస, బీద బతుకులు ఎన్ని రోజులు అని ప్రశ్నించి ఇంట్లో నుండి వెళ్ళిపోయి సైన్యాన్ని తయారుచేసి భూస్వాముల ఘడీల మీద దండయాత్ర చేసిన చరిత్ర పాపన్నది అన్నారు. 18 వ శతబ్దం మొదట్లో సర్వాయి పాపాన్న పెద్ద ఎత్తున్న ఉద్యమం చేసి దండయాత్ర చేసి మొదలు వరంగల్ కోట, ఆ తరువాత భువనగిరి కోట ను ఆక్రమించుకున్నాడన్నారు. తన వెంట వచ్చే సైన్యం కోసం మన జిల్లా లోనే రెండు కోటలు కట్టించాడన్నారు.. అవి ఒకటి ఖిలా షాపూర్, రెండవ ది తాటికొండ అని తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న సామ్రాజ్యం ఖిలా షాపూర్ నుండి హుస్నాబాద్ వరకు విస్తరింప చేసి బడుగు బలహీన వర్గాలకు ధైర్యం ఇచ్చారాన్నారు.

జనగాం జిల్లా పోరాటాల గడ్డ

ఇక్కడ కేంద్రంగా ఎన్నో ఉద్యమాలు జరిగాయన్నారు.

ఈ మట్టి లోనే తిరుగుబాటు చేసే, ప్రశ్నించే తత్వం ఉందన్నారు. ఈ జిల్లాలో పుట్టడం మన అదృష్టమన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ లాంటి పోరాటయోధులకి మనం వారసులమన్నారు. ఈ మండలానికి సంవత్సరానికి రెండు చొప్పున

6 కమ్యూనిటీ హాల్ లను మంజూరు చేస్తానన్నారు. గౌడ కులస్తులు ఎవరైనా చెట్టు మీద నుండి ప్రమాదవశాత్తు పడి చచ్చిపోతే నెలలోపు ఎక్స్‌గ్రేషియా వచ్చేలా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ని కోరుతున్నానని తెలిపారు.

# భాషలను సజీవంగా ఉంచేది అనువాదం




## సెప్టెంబర్ 30... అంతర్జాతీయ అనువాద దినోత్సవం


రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

అనువాదం అంటే సంస్కృత భాషలో పునఃకథనం అని అర్థం. ఒకరు చెప్పిన దానిని మరొకరు చెప్పడం అన్నమాట. ఆధునిక యుగంలో ఒక భాషలో చెప్పిన విషయాన్ని మరొక భాషలో చెప్పడం అనే ప్రక్రియకు “అనువాదం” అనే పేరు స్థిరపడి పోయింది.

ప్రపంచ దేశాలలోని ఒకరికొకరు అర్థం చేసుకునేందుకు సహకరించే ముఖ్యమైన అనువాద క్రియకు సంవత్సరంలో ఒక రోజు కేటాయించాలని అంతర్జాతీయ అనువాదకుల సమాఖ్య నిర్ణయించింది.

అంతర్జాతీయ అనువాద దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 30న నిర్వహించబడుతుంది. లాటిన్ మరియు హిబ్రూ నుండి గ్రీకు భాషలోకి బైబిల్ ను అనువదించిన సెయింట్ జెరోమ్ గుర్తుగా ఈ దినోత్సవం జరుపు కుంటారు. జెరోమ్ సెప్టెంబర్ 30, 420 న మరణించాడు. అనువాద క్రియ ఎంతటి ముఖ్యమైనదో 1953లోనే ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రాన్స్‌లేటర్స్ గుర్తించారు. అంతర్జాలం ప్రపంచాన్ని ఓ కుగ్రామంలో మార్చి వేసిన ఈ తరుణంలో ఒకరి భాష ఒకరు అర్థం చేసుకోవాల్సిన, మాట్లాడుకోవాల్సిన ఆవశ్యకత పెరిగింది. ఈ క్రమంలోనే మే 24, 2017న యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ సెప్టెంబరు 30న అంతర్జా తీయ అనువాద దినోత్సవం జరుపు కోవాలని నిర్ణయిస్తూ దీనికి ఆమోదాన్ని తెలిపింది. అంతర్జా తీయ అనువాద దినోత్సవాన్ని మొట్టమొదట 1991 లో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డెస్ ట్రాడక్టియర్స్ (ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రాన్స్లేటర్స్) స్థాపించారు. ఎఫ్ ఐ టి అనేది ప్రపంచ వ్యాప్తంగా అనువాదకులు, వ్యాఖ్యాతలు మరియు పరిభాషకులను సూచించే అసోసియేషన్ల అంతర్జాతీయ సమ్మేళనం. అనువాదం అనేది అతి ముఖ్యమైనది. ప్రపంచంలోని దేశాలన్నీ ఒకరికొకరు అర్థం చేసుకు నేందుకు సహకరించేది అనువాదమే. ఎందుకంటే ప్రపంచంలోని ఒక్కో దేశంలో ఒక్కో భాష చెలామణిలో వుంటుంది. ఆయా భాషలను తమ సొంత భాషలోకి అనువదించి నపుడే వారికి విషయం అర్థం అవుతుంది. అలా అర్థం చేసుకున్నప్పుడే వివిధ దేశాల నాగరికతలు మనకు తేట తెల్ల మవుతాయి. అందుకే అనువాదం అనేది ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించు కున్నది. దేశాలను ఏకతాటిపైకి తీసుకు రావడంలో, అభివృద్ధికి దోహదం చేయడంలో మరియు ప్రపంచ శాంతి భద్రతలను బలోపేతం చేయడంలో అంతర్జాతీయ అనువాద దినోత్సవం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. భాషా సేవా పరిశ్రమలో అనువాదకులు, వ్యాఖ్యాతలు మరియు ఇతరుల ముఖ్యమైన పనిని గుర్తించడానికి ఈ రోజు గొప్ప అవకాశాన్ని అందిస్తుంది. మారుతున్న కాలాలలో సాంస్కృతిక వార సత్వాన్ని ప్రోత్సహించడం”. భాషల మధ్య సహకారాన్ని సులభతరం చేయడం, అభివృద్ధికి తోడ్పడటం మరియు ప్రపంచ శాంతి భద్రతలను బలోపేతం చేయడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత మరియు భవిష్యత్ మాట్లాడేవారికి భాషలను సజీవంగా ఉంచడానికి దేశీయ భాషలను పరి రక్షించడానికి, అట్టడుగు సంస్కృతులను రక్షించడానికి ఆధునిక కాలపు సాంకేతిక పురోగతిని ఉపయో గించు కోవచ్చు. ప్రపంచంలో 6,500 కు పైగా మాట్లాడే భాషలు ఉన్నాయి. భాషా అడ్డంకులను అధిగమించడం సవాలుగా ఉంది. అనువాదకులు మరియు వ్యాఖ్యాతలు దీన్ని సులభతరం చేస్తారు. అనువాదం మరియు వ్యాఖ్యానం రెండు వేర్వేరు విషయాలు. అనువాదంలో వ్రాత పూర్వక పదం ఉంటుంది. వ్యాఖ్యానంలో మాట్లాడే పదం ఉంటుంది. ఒక పుస్తకం లేదా నివేదికను వేరే భాషకు మార్చాల్సిన అవసరం ఉంటే, అనువాదకుడు అవసరం. వ్యాఖ్యాతలు మాట్లాడే సమాచారాన్ని తీసుకొని మరొక భాషలో అర్థమయ్యేలా చేస్తారు. వ్యాఖ్యానం కేవలం మరొక భాషను తెలుసు కోవడం కాదు. వ్యాఖ్యాతలు సంస్కృతిని కూడా అర్థం చేసుకోవాలి. మానవ చరిత్రను పరిరక్షించడంలో అనువాదకులు కీలక ఏజెంట్లు.

అనువాదకుడు మరియు వ్యాఖ్యాత అనేది ప్రజల మధ్య సంభాషణను సులభతరం చేసే ఒక లక్ష్యానికి అంకితమైన రెండు వృత్తులు. వ్యక్తులు ఒకరినొకరు బాగా అర్థం చేసు కోవడానికి సహాయ పడేటప్పుడు అనువాదకులు మరియు వ్యాఖ్యాతలు ఇద్దరూ అవసరం. ఒక విదేశీ దేశంలో కొత్త వ్యాపారాన్ని ప్రారంభించే టప్పుడు వారు వైవిధ్యం చూపుతారు. వారు ఆసుపత్రుల లోని రోగులకు, పాఠశాలల్లోని విద్యార్థులకు మరియు దేశ, విదేశాలలో పనిచేసే మీడియా ప్రతినిధులకు, కూడా సహాయం చేస్తారు. ఇప్పుడు ప్రపంచంలోని ఎన్నో భాషలకు చెందిన సాహిత్యం, ఇంకా ఆయా దేశాలు అనుసరించే చట్టాలు... తదితర విషయాలన్నీ కేవలం అనువాదంపైనే ఆధారపడి వున్నాయి. అవసరం ఉన్నందున, అనువాదకులు మరియు వ్యాఖ్యాతలకు అధిక డిమాండ్ ఉంది. యునైటెడ్ స్టేట్స్లో, అనువాదకుడు మరియు వ్యాఖ్యాత ఉద్యోగాలు 2024 నాటికి 29% పెరుగుతాయని భావిస్తున్నారు. అత్యధిక డిమాండ్ ఉన్న భాషలలో స్పానిష్, రష్యన్, ఫ్రెంచ్ మరియు జర్మన్ ఉన్నాయి. అరబిక్, చైనీస్, జపనీస్, హిందీ మరియు కొరియన్ భాషలలో క్రమంగా పెరుగుతున్న ఇతర భాషలు. ఇక అనువాదం ప్రక్రియను చూస్తే ఇదివరకు సంస్కృతం, ఆంగ్లం నుంచి మన తెలుగు భాష లోకి ఎన్నో నవలలు, గ్రంథాలు అనువదించ బడ్డాయి. అంతర్జా తీయంగా ప్రఖ్యాతి గాంచిన నవలలతో పాటు, పలు భారతీయ భాషల్లో కూడా జనరంజకంగా పేరొందిన ఎన్నో నవలలను తెలుగు రచయితలు మన భాషలోకి అనువదించారు.

శరత్ చంద్ర ఛటర్జీ కలం నుండి జాలువారిన బెంగాలీ నవల “దేవదాసు”ని తెలుగులోకి అనువదించిన చక్రపాణి, తన రచనాశైలి ద్వారా అందులోని పాత్రలను అచ్చమైన తెలుగు సంప్రదాయానికి తగ్గట్టుగా మలిచి, శరత్‌బాబు తెలుగువాడే అన్న భావనను పాఠకులకు కలిగించడం విశేషం. అందుకే దేవదాసు నవలకు తెలుగులో కూడా బ్రహ్మరథం పట్టారు. భారత్, పాకిస్తాన్ విభజన నేపథ్యంలో రూపుదిద్దుకొని సంచలనాత్మకంగా నిలిచిన హిందీ రచయిత భీష్మ సహానీ నవల “తమస్”.ఇదే నవలను శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలుగులోకి అనువదించారు. ప్రపంచ ప్రఖ్యాత రచయిత మక్సిమ్ గోర్కి కలం నుండి జాలువారిన అత్యద్భుతమైన రచన “మదర్”. అమ్మ పలుమార్లు తెలుగులోకి అనువాద మయింది. సోవియట్ ల్యాండు నెహ్రూ అవార్డు గ్రహీత మరియు స్వాతంత్ర్య సమర యోధులు క్రొవ్విడి లింగరాజు ఈ నవలను తెలుగులోకి అనువదించిన తీరు అమోఘం. క్రైస్తవ సాహిత్యంలో మానవత్వానికి, మనిషి మనుగడకు ఒక అర్థాన్నిచ్చిన కథ బెన్‌హర్. జనరల్ లూ వాలస్ కలం నుండి జాలువారిన ఇదే నవలను మాడభూషి కృష్ణప్రసాద్ తెలుగు లోకి అనువదించారు. టాల్‌స్టాయ్ కలం నుండి జాలువారి, ప్రపంచ సాహిత్య చరిత్రలోనే మైలురాయిగా నిలిచిన నవల “అన్నా కరేనీనా”. ఇదే నవలను శ్రీ తాపీ ధర్మారావు గారు తెలుగులోకి అనువదించడం విశేషం. తెలుగు భాషలోకి అనువాదం అయినట్లుగా, తెలుగు నుండి ఇతర భాషలలోని అనువదింప బడిన రచనలు తక్కువ అనే చెప్పాలి. అను వాదాలను మూలరచనను యథాతథంగా తెలుగులోనికి తర్జుమా చేయడం ఒక పద్ధతి కాగా ఆ మూల రచన సారం చెడకుండా స్వేచ్ఛానుసరణ చేయడం ఇంకొక పద్ధతి. ఆంగ్ల మాధ్యమ చదువులో, తెలుగు రాష్ట్రాలలో స్వభాష నిర్లక్ష్యానికి గురవుతున్న వేళ... తెలుగు భాషలో మరిన్ని అనువాద రచనలు రావాలని, ఇతర రాష్ట్రాల, దేశాల సాహిత్యం తెలుగు పాఠకులకు, ప్రజానీకానికి అందాలని ఆశిద్దాం.

# సాంప్రదాయ రీతిలో బొడ్డెమ్మ నిమజ్జనం

ధర్మపురి సెప్టెంబర్ 29 (ప్రజామంటలు):

రామ కిష్టయ్య సంగన భట్ల

సనాతన ప్రాచీన హైందవ సాంప్రదాయాలకు అనాది నుండి సాక్షీభూతంగా నిలిచి యున్న సుప్రసిద్ధ గోదావరి తీరస్థ పుణ్య తీర్థమైన ధర్మపురి క్షేత్రంలో ఆదివారం బొడ్డెమ్మ పండుగ సంబరాలు వైభవంగా, ఆనందోత్సవాల మధ్య జరుపు కున్నారు. ఈక్షేత్రంలో జ్యేష్టా దేవి, లక్ష్మీదేవిల ప్రతీకలుగా బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలను భక్తి శ్రద్ధలతో, పిల్లా పాపలతో కలిసి మహిళలు జంట పండుగలుగా పక్షం రోజుల తేడాతో నిర్వహించడం అనాదిగా ప్రాచీన వంశపారంపర్య ఆచరణీ యమై ఉండగా, శ్రావణ బహుళ అమా వాస్య, పోలాల అమావాస్యతో ప్రారంభించి భాద్రపద పౌర్ణమి అనంతరం ముగించబడే బొడ్డెమ్మ పండుగలో భాగంగా క్షేత్రంలోని రామానందీశ్వర ఆలయ సంబంధితప్రధాన వాడలో మట్టితో బొడ్డెమ్మను తయారు చేసి ఉంచి, పదిహేను రోజు లపాటు అన్ని రకాల పూలతో పూజించి, ఆటలాడి, ప్రదక్షిణలాచరించి, నివేదనలు ఉంచడం అనాదిగా ఆచరిస్తున్న పరంపరానుగత సదాచారం. బొడ్డెమ్మను సాగనంపనిదే బతుకమ్మ పండుగ చేయని సాంప్రదాయ నేపథ్యంలో ఆ ఆచారాన్ని అనుసరించిబొజ్జా వారి, పెద్దంభట్ల వారి గద్దెల సంబంధిత మహిళలు, పిల్లలు15 రోజులపాటు బొడెమ్మ వేడుకలను నిర్వహించి, చివరి రోజైన ఆదివారం వేరువేరుగా రెండు చోట్ల సామూహిక భోజనాలు ఆరగించి, సాయం సమయాన పిల్లాపాపలను పెళ్ళి కూతుళ్ళలా సింగారించి, నూతన ప్రస్తాలంకృతులైన మహిళలు గోదావరి నది వరకు మేళతాళాలతో పాటలతో ఒకే జట్టుగా ఊరేగింపు జరిపారు. నదీ తీరాన తిరిగి ఆటపాటలతో గడిపి, రాత్రి సమ యమైనాక నది నీటిలో బొడ్డెమ్మలను నిమజ్జనం చేసి వెను తిరిగారు. సాయంత్రంతో ప్రారంభమై, రాత్రి వరకూ జానపద బాణీలో కొనసాగు తున్న వారసత్వ సాంప్రదాయాలకు అనుగుణంగా బృందగానం చేసిన సాంప్రదాయ గీతాలు మంత్రముగ్ధుల గావించాయి.



# వ్యాసకర్తలకు వినతి

రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.

mantalukathalu@gmail.com -ఎడిటర్

## ఈనెల 30న విశ్వహిందూ పరిషత్ భారీ నిరసన కార్యక్రమాలు

హైదరాబాదసెప్టెంబర్ 29 (ప్రజామంటలు):



తిరుమల తిరుపతి లడ్డు ప్రసాదంలో జరిగిన కల్తీ ఘటనను విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ దుశ్చర్యకు పాల్పడ్డ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, 3,0వ తేదీ సోమవారం రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగింది. లడ్డు కల్తీకి పాల్పడ్డ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుత నిరసనలు వ్యక్తం చేస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు శ్రీ నరసింహ మూర్తి శ్రీ లక్ష్మీ నారాయణ తెలియ జేశారు. ప్రధాన కూడళ్లలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తూ, కలెక్టర్ కార్యాలయాల్లో వినతి పత్రం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా హిందూ బంధువులందరూ హాజరై వెంకటేశ్వర స్వామి పవిత్రతను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు.



## పొన్నం యువసేన లక్ష్యం

'మానవ సేవే మాధవ సేవ' పరామర్శించిన తంగళ్ళపల్లి రమేష్

ఎల్కతుర్తి సెప్టెంబర్ 29 (ప్రజామంటలు):

ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో అనారోగ్య కారణంతో చనిపోయినటువంటి మామునూరు కొమురయ్య వారి భార్య అయిన లచ్చమ్మను వారి కుమారుడు తిరుపతి చంద్రమౌళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన పొన్నం యువసేన తంగేళ్లపల్లి రమేష్ అనంతరం మామునూరు కొమురయ్య చిత్రపటానికి



ప్రగాఢ శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని వేడుకున్నారు ఈ సందర్భంగా పొన్నం యువసేన తంగెళ్లపల్లి రమేష్ ఆకలి కేకలు తెలిసిన వాడిని నిరుపేద కుటుంబాల యొక్క పరిస్థితులలో మెదిలిన నిరుపేద కుటుంబాలంటే ఎటువంటి దీనస్థితులు ఉంటాయో తెలిసిన వాడిని కావున నిరుపేద కుటుంబాలకు ఉడత భక్తి సాయంగా నిరుపేద కుటుంబాలకు సేవే లక్ష్యంగా చేయాలనే లక్ష్యంతో పొన్నం యువసేన అనే పేరుతో కార్యక్రమాలు మండలంలో ఉన్నటువంటి నిరుపేద కుటుంబాలకు సహాయం చేస్తూ వస్తున్నానని ఇట్టి కార్యక్రమాలు నిరుపేద కుటుంబాలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటాయని ఎటువంటి కులం మతం రాజకీయ భేదాలు లేకుండా ప్రతి నిరుపేద కుటుంబానికి చేస్తున్నటువంటి సేవే కార్యక్రమం చేస్తున్న సహాయము ప్రతి ఒక్కరికి అందాలనే లక్ష్యం పొన్నం యువసేన యొక్క లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరారం గ్రామ శాఖ అధ్యక్షుడు బచ్చు శ్రీధర్ రావు, మాజీ వార్డు మెంబర్ సభ్యులు చల్లూరి వేణు, పొలాటి తిరుమల్ రావు, గుండేటి లక్ష్మీనారాయణ, మేకల బాబు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు చిలుముల వినోద్, మామునూరుకిషోర్,గాజులచిరంజీవి,తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్చర్యం కలిగించే ఈ సంఘటన నిడిగొండ సంపులో నీరు వేడెక్కుతున్నది

## చరిత్ర పరిశోధకులు రెడ్డి రత్నాకర్ రెడ్డి

జనగామ సెప్టెంబర్ 29 (ప్రజామంటలు): ఎక్కడైనా ఇంట్లో తవ్వుకున్న సంపులో నీరు వేడెక్కి ఆవిర్లు కక్కుతుందా? ఆశ్చర్యం కలిగించే ఈ సంఘటన. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామంలో చోటు చేసుకుంది. నిడిగొండ గ్రామంలోనే మండపం వద్ద జైపాల్ రెడ్డి ఇంటిలో సంపు ఉంది. గత నెల రోజులుగా వారి కుటుంబం స్థానికంగ లేదు. ఈరోజు ఉదయం నిడిగొండకు చేరుకున్నాడు. తన ఇంటిని శుభ్రం చేసు కుంటుండగా సంపు నీటితో అవసరం పడింది. సంపు పైన మూత తీయగానే ఒక్కసారిగా సంపు నుండి వేడి ఆవిరి బయటకు వచ్చింది. ఆ నీల్లలో చేయి పెడితే కాలిపోయి బొబ్బలెక్కుతుంది. స్థానిక యువకులైన క్రిష్ణ, మధులు డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డికి సమాచారం అందించగా సంపును సందర్శించి క్షేత్ర పరిశోధన చేశారు. సంపుకు ఎలాంటి విద్యుత్ కనెక్షన్ లేదు. పక్కనే 10 అడుగుల దూరంలో ఉన్న చేదబావి నీటిని, సమీపంలో ఉన్న ఇతరుల ఇళ్ళల్లో ఉన్న సంపుల్లో ఉన్న నీటిని పరీక్షించారు. ఒక్క జైపాల్ రెడ్డి ఇంటిలో సంపు నీరు మాత్రమే వేడెక్కుతుందని నిగ్గు దేల్చారు. స్థానిక విద్యుత్ అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి సాల్టినేషన్ పరీక్ష చేశారు. ఆ పరీక్షలో ఏమీ తేలలేదు. సంపులోని నీటిని పూర్తిగా తీసివేసి కొత్తగా నీటిని నింపి చూస్తే మరికొంత స్పష్టత వస్తుంది. సంపులో నీరు వేడెక్కడానికి మరిన్ని కారణాలు ఉండవచ్చు.



సంపులో నీరు వేడెక్కడం అనే ప్రక్రియ అనేది గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారణ వలన జరగవచ్చు. సంపు క్రింద క్లోరో ఫ్లోరో కార్బన్స్ మొదలగు వాయువుల ఉద్గారణం వలన భూమి అపరిసర ప్రాంతంలో వేడెక్కడం వలన ఆ సంపులోని నీరు వెడెక్కే అవకాశం ఉంది. పరిసర ప్రాంతంలో బయోమాస్ ట్యాంక్ లీక్ కావడం వలన దానిలో వుండే వ్యర్థాల వలన ఉద్గారం అయ్యే మిథేన్, కార్బన్ వలన కూడా సంపులో నీరు వెడెక్కవచ్చు .

**కృష్ణవస్తువు:**

భూమి అంతర్భాగంలో కృష్ణవస్తువు (నల్లని వస్తువు) ఆనవాల్లు ఉన్నచో ఉష్ణవికిరణం అనే ప్రక్రియ వలన నీరు వేడెక్కే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రక్రియలో నీరు ఉదయం నుంచి సాయంత్రం వరకు చల్లగా ఉండాలి.కానీ నిడిగొండలో నీరు 24 గంటలు వేడెక్కడం జరుగుతుంది. శాస్త్రవేత్తలు పరిశోధించి ఈ రహస్యం ఛేదించాలని గ్రామస్తులు కోరారు.

## మొదటి జన్మదిన వేడుకలకు హాజరైన మాజీ ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్

వేలేరు సెప్టెంబర్ 29 (ప్రజామంటలు):

వేలేరు మండల కేంద్రానికి చెందిన కూరపాటి అఖిల-విజేందర్ కుమార్తె శ్రీ శాన్విక జన్మదిన వేడుకలను వారి నివాసం వద్ద నిర్వహించగా సద్దాం హుస్సేన్ హాజరై నిండు మనస్సుతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చర్ల శ్రీనివాస్, కూరపాటి సురేష్, గజ్జల రాజేష్, మహేష్, సలీం మాలిక్, అఖిల్ పాల్గొన్నారు.

